క్లుప్తంగా

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆగస్టు 1న నిర్వహించే మార్పుకోసం మహా ఉద్యమం చలో హైదరాబాద్ కార్యక్రమం పోస్టర్లను ఏబీవీపీ నాయకులు విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సర్కార్ ప్రభుత్వ విద్యను కార్పొరేట్ చేతుల్లో పెడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలోని బాసర ఐఐటీతో పాటు ఇతర హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, పాఠశాలలు, కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించే కథనభేరి సభకు పెద్ద ఎత్తున విద్యార్థులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోరటి భరత్, ఏబీవీపీ నాయకులు మల్లేశ్, సురేశ్, సాయి, సుమన్‌నాయక్, శంకర్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తలకొండపల్లిలో బీజేపీ ఇంటింటి ప్రచారం

తలకొండపల్లి: బీజేపీ సీనియర్ నాయకుడు తల్లోజు ఆచారి మంగళవారం మండలంలో పర్యటించనున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవిగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొంటారన్నారు. మండల పరిధిలోని రాంపూర్, సంఘాయిపల్లి, చౌదర్‌పల్లి, మాదాయిపల్లి, ఇస్రాయిపల్లి, చెన్నంపల్లి, వెంకటాపూర్, అంతారం, వెల్జాల్ తదితర గ్రామాల్లో పర్యటిస్తారని చెప్పారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు.

'మా ఉద్యోగాలను క్రమబద్ధీకరించండి'

ఇబ్రహీంపట్నం: విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులనుక్రమబద్ధీకరించాలని ఆసంఘం నాయకులు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలో సమగ్ర శిక్ష ఉద్యోగులుగా సీఆర్‌పీ, ఐఈఆర్‌పీ, ఎంఐఎస్, కంప్యూటర్ ఆపరేటర్స్, పీటీఐ, కేజీబీవీల్లో.. రోస్టర్, మెరిట్ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం నియామకం జరిగిందని ఆ సంఘం నాయకులు తెలిపారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించే అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేకు వివరించారు.

ఎన్‌ఎస్‌యూఐ నూతన కమిటీ ఎన్నిక



ప్రవీణ్‌కు నియామకపత్రం అందజేస్తున్న షాబుద్దీన్

కడ్తాల్: విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడాలని ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో మండల పరిధిలోని ముద్విన్ గ్రామ ఎన్ఎస్‌యూఐ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. గ్రామ ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా షఫీ, జశ్వంత్‌తో పాటు, మరికొంతమందితో నూతన కార్యవర్గాన్ని నియమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధు, సురేందర్‌రెడ్డి, స్వామి, నర్సింహ, మల్లేశ్, రాజేశ్, శ్రీకాంత్, ఇమ్రాన్‌బాబా, శివకుమార్, రాజు, మహేందర్, పవన్, దర్శన్, మహేశ్ ఉన్నారు.

కిటకిటలాడిన సీహెచ్‌సీ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

యాచారం: ఎడతెరిపి లేని వర్షాలు, పంచాయతీ సిబ్బంది సమ్మెతో గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. దీంతో ప్రజలు పలు రోగాలబారిన పడుతున్నారు. సోమవారం ఒక్కరోజే యాచారం సీహెచ్‌సీకి 200 మందికి పైగా రోగులు వచ్చారు. అందులో 20 మందికి పైగా వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరారు. కొందరికి గ్లూకోజ్ ఎక్కించారు. మరికొందరికి మందులు అందజేసి ఇంటికి పంపించారు. నక్కర్తమేడిపల్లి, యాచారం, మంతన్‌గౌరెల్లి, గునుగల్, మొండిగౌరెల్లి, నందివనపర్తి, నల్లవెల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల నుంచి రోగులు అధిక సంఖ్యలో ఆస్పత్రికి వచ్చారు.

సాగు స్వల్పమే..!



గునుగల్‌లో ముదిరిపోతున్న వరి నారు

- వానల ఆలస్యంతో ఆసక్తి చూపని రైతులు
- డివిజన్‌లో 30 శాతం కూడా దాటని వరినాట్లు
- దయనీయంగా మెట్ట పంటల సాగు

యాచారం: ఈ ఏడాది వర్షాలు ఆలస్యం కావడంతో వరిపంట సాగు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం ముసుర్ల వర్షం కురుస్తున్నా నార్లు పోసుకునే అవకాశం ఉండదని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. వానాకాలం కింద వరి సాగు చేయాలంటే జూన్ నెల నుంచి జూలై మొదటి వారం వరకు తూకాలు పోసుకునే అవకాశం ఉంటుంది. జూన్ నెల నుంచి జూలై మొదటి వారం లోపు తూకాలు పోసుకుంటే ఆ తర్వాత నాట్లేస్తే వరి పంటలో మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని రైతుల్లో నమ్మకం. కాని ఈ ఏడాది వర్షాలు అదునులో కురియకపోగా, రైతులు తూకాలు పోసుకునే విషయంలో వెనుకంజ వేశారు. ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం తదితర మండలాల్లో వానాకాలం కింద 21వేల నుంచి 25వేల ఎకరాలకు పైగానే వరి సాగు అయ్యే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ అంచానా వేసింది. సాగు అంచానా మేరకు వ్యవసాయ శాఖ ఆయా మండలాల్లో ఎరువులు, విత్తనాలు నిల్వ ఉంచేందుకు గాను సిద్ధమయ్యారు. ఐతే వర్షాలు ఆలస్యంగా కురవడంతో వ్యవసాయాధికారులు కూడా టార్గెట్ ఇచ్చిన మేరకు వరి విత్తనాలు, ఎరువులను దిగుమతి చేసుకోలేకపోయారు. ఆయా మండలాల్లో ఉన్న పీఏసీఎస్‌లు కూడా భారీ మొత్తంలో ఎరువులు, విత్తనాలు తెచ్చి రైతులకు విక్రయాలు జరిపి మంచి లాభాలు పొందుదామనే ఆశపడ్డాయి. సాగు విస్తీర్ణంలో గణనీయమైన మార్పులతో పీఏసీఎస్ అధికారులు కూడా ముందే ఎందుకు నిల్వలు తెచ్చి పెట్టుకోవాలని ఆలోచనలో పడ్డారు.

సగం కూడా కాలే..

వర్షాలు ఆలస్యంగా కురవడంతో ఇబ్రహీంపట్నం డివిజన్‌లో వరి సాగు సగం కూడ కాలేదు. డివిజన్‌లోని యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రతి ఏడాది వందలాది ఎకరాల్లో వరిపంట సాగు చేస్తారు. అయితే ప్రస్తుతం ఆయా గ్రామాల్లోని రైతులు బోరుబావుల్లో నీళ్లను బట్టి, వర్షాలు కురియకపోతే పంటలు ఎండిపోయే అవకాశం ఉంటుందని వరి తూకాలు కూడా ఎక్కువగా పోయలేదు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రైతులు వరి తూకాలు పోశారు. ఇప్పటికే డివిజన్‌లో 15వేల ఎకరాలకు పైగా వరి సాగు అయ్యే అవకాశం ఉండగా ప్రస్తుతానికి 6వేల ఎకరాల్లో కూడా నాట్లు పూర్తి కాలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరి సాగుపై ఆశ ఉన్నప్పటికీ తుకాలు పోసుకునే అవకాశం లేదని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

మెట్ట పంటలకు తీవ్ర నష్టం..

ఈ ఏడాది మెట్ట పంటల సాగు పరిస్థితి దయనీయంగా మారింది. ఇబ్రహీంపట్నం డివిజన్‌లో వరి సాగు కంటే రైతులు పత్తి, కందులు, జొన్న తదితర పంటలను సాగు చేస్తారు. ముఖ్యంగా మాడ్గుల్, యాచారం మండలాల్లో కేవలం పత్తి పంటనే 50 వేల ఎకరాలకు పైగా సాగు చేస్తారు. కానీ ఈ ఏడాది ఆలస్య వర్షాలతో పత్తి పంట సాగు సగానికి కూడా దాటలేదు. మాడ్గుల్, యాచారం మండలాల్లో పత్తి పంట సాగు చేయడానికి రూ.కోట్లాది విలువ జేసే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తెచ్చి నిల్వ చేసుకున్న రైతులు ఆలస్య వర్షాలతో అప్పుల పాలయ్యే దుస్థితి నెలకొంది. గత రెండేళ్లుగా పత్తి ధర క్వింటాల్ రూ.7,500కు పైగానే పలకడంతో ఈ మారు కూడా రైతులు పత్తి పంట వైపు ఆసక్తి చూపి ముందే పొలాలను సిద్ధం చేసుకున్నారు. కాని వరుణుడు కరుణించకపోవడంతో పత్తి సాగు గణనీయంగా తగ్గింది.

దిగుబడిపై ఆందోళనగా ఉంది



ఈ ఏడాది వర్షాలు నెల ఆలస్యంగా కురిసాయి. రూ.20 లక్షలు ఖర్చు చేసి 50 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. వర్షాలు కురిస్తే ఇప్పటికే రెండు అడుగుల లోతు చెట్లు పెరగాలి. కానీ రెండు, మూడు ఇంచులు కూడా పెరగలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కలుపు బాగా వచ్చే అవకాశం ఉంది. పంట దిగుబడి వస్తుందో.. రాదోనని ఆందోళనగా ఉంది.

– కొండల్‌రెడ్డి, రైతు, మాడ్గుల్

రెండున్నర ఎకరాల్లోనే వరి



వర్షాలు సంవృద్ధిగా కురిస్తే 7 ఎకరాలకు పైగా వరి సాగు చేసేవాడిని. కానీ ఆలస్య వర్షాలతో ప్రస్తు తం రెండున్నర ఎకరాల్లోనే వరి సాగు చేశాను. వర్షాలు లేకపోతే వరిపంట నాటేసినా.. నీళ్ల లేక ఎండిపోయే అవకాశం ఉంటుంది. వారం కింద వరి పంట నాటేశాను. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ముదిరిన నారు నాటేస్తున్నాను. దీనికి తోడు కూలీ రేట్లు బాగా పెరిగాయి. గిట్టుబాటు కావడం లేదు.

– లక్ష్మీపతిగౌడ్, రైతు, నల్లవెల్లి

మూడోవంతు కూడా సాగు కాలేదు



ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా కురిశాయి. అందు వల్ల మెజార్టీ రైతులు వరి పంట సాగుపై ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం కురి సే వర్షాలతో వరి తూకాలు పోసుకునే పరిస్థితి ఉండదు. పత్తి, కంది, జొన్న పంటల సాగు కూడా గణనీయంగా తగ్గింది. పత్తి పంట సాగు కోసం మండలంలోని పలు గ్రామాల్లో రైతులు విత్తనాలు, ఎరువులు తెచ్చి నిల్వచేసి ఉంచుకున్నారు. యాచారం మండలంలో 12వేలకు పైగా వరి సాగుకు అవకాశం ఉండగా, నేటికి కేవలం 3వేల ఎకరాలు కూడా సాగు కాలేదు.

– సందీప్‌కుమార్, ఏఓ, యాచారం

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, ఉపాధ్యాయులు

కడ్తాల్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినులకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం మంత్రి కేటీఆర్ పుట్టినరోజు వేడుకలను విద్యార్థులతో కలిసి నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, గ్రామ అధ్యక్షుడు నర్సింహ, సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, సులోచన, ఎంపీటీసీలు మంజుల, లచ్చిరామ్‌నాయక్, ఉప సర్పంచ్ రామకృష్ణ, రమణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్ అలీ, నాయకులు లక్ష్మణ్‌చారి, శ్రీను, శ్రీకాంత్, ఇర్షాద్, పాఠశాల ఎస్‌ఓ అనిత ఉన్నారు.

డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె

తేల్చిచెప్పిన జీపీ కార్మికులు



మంచాల: దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తూ వినూత్నంగా నిరసన తెలుపుతున్న కార్మికులు

మంచాల: సమస్యలు పరిష్కరించాలని జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారంతో 19వ రోజుకు చేరుకుంది. మంచాల మండల కార్యాలయం వద్ద కార్మికులు సమ్మెలో భాగంగా దున్నపోతుకు వినతి పత్రం అందజేసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ డిమాండ్లు నెరవేర్చాలని కార్మికులు కోరుతున్నారు. సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ, పంచాయతీ కార్మిక సంఘం నాయకులు ఖాజాపాషా, భాస్కర్, శంకరయ్య, యాదయ్య, వెంకటేష్, రవి, సురేష్, జంగయ్య, సుజాత, నర్సమ్మ పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన

యాచారం: పంచాయతీ సిబ్బంది ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సోమవారం మోకాళ్లపై కూర్చొని దీక్ష నిర్వహించారు. 19 రోజులుగా వివిధ పద్ధతుల్లో సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి పట్టింపులేదని మండిపడ్డారు. సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రూ.19,500 వేతనం ఇవ్వాలి

తలకొండపల్లి: పంచాయతీ కార్మికులకు నెలకు కనీసం రూ.19,500 వేతనం ఇవ్వాలని సీఐటీయూ మండల కన్వీనర్ కురుమయ్య డిమాండ్ చేశారు. ఎంపీడీఓ కార్యాలయ ఎదుట జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారానికి 19 రోజులకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని సందర్శించి కురుమయ్య మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, జీఓ నంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్, 10 లక్షల ప్రమాదబీమా వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం జిల్లా నాయకులు వెంకటయ్య, గొర్ల కాపరుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెంటయ్య, జీపీ మండల అధ్యక్షురాలు యాదమ్మ, కోకన్వీనర్ రవనీల, అలివేలు, జంగయ్య, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



ఆమనగల్లు: ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని నవచైతన్య కాలనీకి చెందిన కుమారికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.2.50 లక్షలు మంజూరయ్యాయి. ఆమనగల్లు పట్టణంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కుమారి కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించారు. టీఆర్ఎస్ సీనియర్ నేత గోలి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ అనురాధ, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, పోలెపల్లి ఎంపీటీసీ దోనాదుల కుమార్, నాయకులు పత్యానాయక్, జంగయ్య, కేశవులు, ఖలీల్, శ్రీను, వెంకటేశ్, పంతునాయక్,బాలకృష్ణయ్య పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికే గుర్తింపు..

మాడ్గుల మండలం సంద్రలగడ్డతండా గ్రామ పరిధిలోని తోడేలుగుండు తండాకు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నివాసంలో సోమవారం నాయకులు శంకర్‌నాయక్, రతన్‌నాయక్, సీత్యానాయక్, రాములునాయక్‌లతో పాటు పలువురు యువకులకు ఎమ్మెల్యే సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామని, కష్టపడి పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు ఇస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉంటామని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, సర్పంచ్ మంజుల, నాయకులు సరిరాం, జైపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన



ఇబ్రహీంపట్నంలో కురుస్తున్న వర్షం

ఇబ్రహీంపట్నం: మండలంలో సోమవారం సాయంత్రం వర్షం దంచి కొట్టింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై సుమారు గంటన్నరపాటు ఏకధాటిగా వర్షం కురిసింది. మండల పరిధిలోని ఇబ్రహీంపట్నంలో సాయంత్రం ఆరున్నర నుంచి 8 గంటల వరకు జోరుగా వర్షం కురిసింది. దండుమైలారంలో అత్యధికంగా 7 సెంటీ మీటర్లు, మంగళ్‌పల్లిలో 3.5 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. రోడ్లపై వర్షపునీరు నిలవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. మూడు రోజుల విరామం తర్వాత తిరిగి సోమవారం వర్షం దంచికొట్టింది. దీంతో పట్నంలో వాతావరణం పూర్తిగా చల్లబడింది.

గొర్ల పంపిణీ చేపట్టండి

ఎంపీడీఓకు సంఘం నేతల వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచాల: గొర్ల కాపర్లకు వెంటనే గొర్రెలను పంపిణీ చేయాలని అఖిల భారత యాదవ మహా సభ నాయకుడు వెంకటేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మంచాల మండల కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌కు ఈమేరకు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. చెన్నారెడ్డిగూడ గ్రామంలో 150 మంది గొర్లకాపర్లు ఉన్నారని తెలిపారు. గ్రామంలో ఇప్పటివరకు మొదటి విడత కూడా గొర్ల పంపిణీ చేయలేదన్నారు. రెండో విడుత ఇస్తామని చెప్పడం తప్ప ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం గ్రామంలో అర్హులందరికీ గొర్రెలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పరమేష్, నాయకులు వెంకటేష్, దేవెందర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

బీజేపీ నేత రమణారెడ్డి



పీఆర్ డిప్యూటీ ఈఈకి వినతిపత్రం ఇస్తున్న రాయపోల్ గ్రామస్తులు

ఇబ్రహీంపట్నం: రాయపోల్ గ్రామంలో ఎన్ఆర్ఇజీఎస్ నిధులతో మూడు నెలల క్రితం వేసిన సీసీ రోడ్డు వర్షాలకు అధ్వాన్నంగా తయారయ్యిందని బీజేపీ నేత రమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన గ్రామస్తులతో కలిసి రోడ్డును పరిశీలించడంతో పాటు పీఆర్ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని ఆరోపించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ భవనం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు కూడా నాసిరకంగా చేపడుతున్నట్లు ఆరోపించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఉన్నతాధికారులు రోడ్డు, ఇతర నిర్మాణాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

ఐటీ రంగానికి దిక్సూచి కేటీఆర్

బీఆర్ఎస్ యువనేత, ఐటీ మంత్రి కేటీఆర్ పుట్టినరోజు వేడుకలను సోమవారం కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కేకలు కట్‌చేయడం, బాణాసంచా కాల్చడం, రక్తదానం, అన్నదానం, పండ్ల పంపిణీ వంటివి చేసి సంబురాలు చేసుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్ కేటీఆర్ అంటూ నినాదాలు చేశారు. ఐటీ రంగంలో యువతకు ఉపాధి కల్పించడంలో కేటీఆర్ చురుకైన పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. పలుచోట్ల మొక్కలు నాటి కేటీఆర్‌కు బర్త్‌డే విషెస్ తెలిపారు. - సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం: మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, నాయకులు



కడ్తాల్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి



మాడ్గుల: కేక్ కట్‌చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



తలకొండపల్లి: కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఆమనగల్లు: కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇంటి నిర్మాణానికి ఉప్పల ట్రస్టు చేయూత

తలకొండపల్లి: నిరుపేదల ఇండ్ల నిర్మాణాలకు ఉప్పల ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందిస్తున్నారు. సోమవారం మండల పరిధిలోని లింగారావుల్లికి చెందిన చెన్నయ్య ఇంటి నిర్మాణానికి ఇసుక, సిమెంట్, ఇటుక, కాంక్రీట్ తదితర మెటీరియల్‌ను ఉప్ప ట ట్రస్టు సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, సర్పంచ్ ఎల్లమ్మ, ఉప సర్పంచ్ మణికంఠ, తిరుపతయ్య, యాదయ్య, బ్లడ్ బ్యాంక్ క్యాంపు చైర్మన్ అంజిరెడ్డి, వార్డు సభ్యుడు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సభ్యుడు బలిజగూడ గ్రామానికి చెందిన బాత్కుల యాదయ్య మే 12న మృతిచెందాడు. సహకార సంఘం ద్వారా మృతుడి కుటుంబానికి అందించే రూ.25వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి మృతుడి కుమారుడు ప్రకాష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కందాడి మహిపాల్‌రెడ్డి, మేనేజర్ జక్కుల ఐలేష్‌యాదవ్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి

సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ బల్‌రాంనాయక్



సీఐ, ఎస్ఐని సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ బల్‌రాం నాయక్‌ను సోమవారం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు జక్కు అనంతరెడ్డి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నిట్టె నారాయణ, మాడ్గుల మండలం రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రవితేజ, బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సత్కరించారు. పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు తమ పూర్తి సహకారం అందిస్తామని నేతలు అన్నారు. బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, శంకర్, పరమేశ్, వెంకటయ్య, జంగయ్య, మైసయ్య, కాశయ్య, కుమార్, నర్సింహ, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్షలు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించేంతవరకు దీక్షలు కొనసాగుతాయని జేఏసీ నాయకులు రేణురెడ్డి అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్ష సోమవారానికి 22వ రోజుకు చేరుకుంది. మండల ఏర్పాటుకు సహకరిస్తామన్నా స్థానిక ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హామీ నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించేవరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, రమేష్, వెంకటమ్మ, యాదమ్మ, మహేష్, ఈశ్వరమ్మ, నరేందర్‌గౌడ్, రాజెందర్, అశోక్, ఆంజనేయులు, జీవన్, రత్నయ్య, మాజీ సర్పంచ్ జంగమ్మ, మైసయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో ఉప సర్పంచ్



మ్యాన్‌హోల్ ఓపెన్ చేస్తున్న ఉపసర్పంచ్ జగన్

యాచారం: పంచాయతీ సిబ్బంది సమ్మెతో కొత్తపల్లి గ్రామంలో పేరుకుపోయిన చెత్త, నిండిపోయిన డ్రైనేజీ కాల్వలను సోమవారం ఆ గ్రామ ఉపసర్పంచ్ కావలి జగన్ తొలగించారు. వార్డు సభ్యులతో కలిసి పలు కాలనీల్లో నిండిపోయిన డ్రైనేజీ కాల్వలను శుభ్రం చేశారు. చెత్తను స్వయంగా ఎత్తి ట్రాక్టర్లలో పోసి తొలగించారు. కాల్వల ఎయిర్‌వాల్వ్‌లను తెరిచి శుభ్రం చేశారు.